# సీతకాపరం

[ క థా ని క ]

కథకుడు :
శ్రీ రా. సి. ఆంజనేయశాస్త్రి

"దంతావధానం అయిందా బావా?" అంది సీత వాకిలిముందు రథంముగ్గు వేసి సావిట్లో కొస్తూను.

"మీ అక్కయ్య లేదుగా మరి...రాత్రి......" అన్నా నేను, మొహంమీదికి వాలిన జుట్టు పైకి తీసుకుంటూ కనుకొలకుల్లోంచి చూసి.

"నేనున్నాగా సిళ్ళివ్వటానికి?" అంది కొంచెం కోపంగా చూస్తున్నట్లు కళ్లు అదోలా పెట్టి. అయినా పెదిమెలమీద కొంటెనవ్వు తళతళ కనిపిస్తూనేవుంది.

"అయితే వరసలు తప్పినట్టున్నాయి 'తావధా'లికి" అన్నా బింకంగా. కొంచెం ధైర్యం చిక్కింది.

"తప్పక్కర్లేదు. నిన్న సాయంత్రం కారపు శనగలు పెట్టాగా!" అంది పక్కున నవ్వి. అంత అమాయకపునవ్వు ఎలా చేసైంది! నాలో ఏదో మాలిన్యం వుందేమో! మళ్లా ఇంకో మెట్టెక్కిస్తూ—

"కాని నఖాలుమాత్రం సోమరిపోతుల్లా కూర్చున్నాయి." అన్నా, గుండె బిక్కు బిక్కు మంటున్నా కూడా. సూక్ష్మంగా సీతకళ్లల్లోకి చూస్తూ. ఆఅమ్మాయి ఎంతో ధీమాగా "నిజమే, జాజిమొగ్గలు కోయిస్తే సరిపోయేది వాటితో" అంది. నాకు సందు చిక్కలేదు.

"...ఓడిపోయా......" నన్నా విజయగర్వంతో.

"నేనుమాత్రం గెలిచానా, బావా?....నా నోరు పడేపోయిందికదా ఈ నాలుగేళ్ల నుంచీని......ఎన్నాళ్ళయింకీ సరసమైన మాట విని?" అంటూ బొటబొటా కన్నీరు కార్చింది. నాకు బాగా అర్థం కాలేదు. నాలో ఎవరో "నువ్వు తప్పు చేశావేమో, క్షమాపణకోరుకో" అని తొందర చెయ్యటం మొదలెట్టారు. కంగారుగా "...సీతా, ఎందు కలా ఏడుస్తావు? నేను మాటవరసకి అన్నా... తప్పుంటే క్షమించు..." నామాట పూర్తికాక మునుపే నా పెదిమెలికి తాకీతాకనట్లుగా, తామర మొగ్గలాంటి తనచేతిని అడ్డంపెట్టి "ఎంతమాట, బావా! నన్ను ఒక్తిపశువుకింద కట్టేశావా?...... ఎండి మోడై పోతున్న యీ కట్టెకి మళ్లా చిగిర్చేందుకు జీవజలం పోశావు నువ్వు, యిప్పుడు..." అంది. నక్షత్రాల్లాగా మెరిసే కళ్ళల్లో, కదుల్తున్న హృదయవేదనా బాష్పం బాష్పకణమై కొలకుల్లోంచి జారి నున్నని కపోలం మీదుగా గుండీఊడిన జాకెట్టుపువ్వుని తడిపి గుండెల్లో కలిసిపోయి తన వలయాన్ని పూర్తిచేసుకుంది. ఆ వలయంలో సుళ్లుతిరిగిపోతున్న నేను "హారే రామ, హారే రామ!" అనే ధ్వనికి ఉలిక్కిపడి పక్కకి తిరిగేసరికి, కాలవలో స్నానంచేసి తడిబట్టల్తో తిరిగివస్తున్న సీతఅత్తగారు కనిపించింది. సీత లోపలి కెళ్లి ఎంతసేపయిందో నాకు తెలీదు. ఏమిటీ ఈఅనుభవం?!

అత్తగారు వస్తూనే "ఇంకా మొహం కడుక్కోలేదు నాయనా?" అంటూ "ఒసేయి, మీ బావకి తాటాకూ, కచ్చికా యివ్వవే!..." అని ఓకేక పెట్టింది కోడలికి వినిపించేటట్టుగా.

"అక్కర్లేదు పిన్నీ, నా దగ్గిర టూత్ పేస్టూ, బ్రష్షూ వున్నాయి. నీళ్లుమాత్రం చాలు..." అన్నా.

సీత గుండుచెంబుతో నీళ్లు తెచ్చియిచ్చింది.

"ఏమో నాయనా, మాకు కచ్చికా, తాటాకే అలవాటు. పల్లెటూరుకదూ!... మరిచిపోయా, కాఫీ కావాలిగా నీకు!... ఒసే సీతా, నీకు మీ ఊళ్లో అలవాటేగా?...పొడి దొరకదు కామాలు ఈ ఊళ్ళో!... పోసి, బిళ్లలకాఫీ బాగుంటుందా!..." అంటూ, నామాట

వినిపించుకోకుండానే చాకలాడితో కాఫీబిళ్ళలు తెమ్మని పురమాయించి దొడ్లో కెళ్లిపోయింది సీతఅత్తగారు.

కూలీల ఎద్దడి జాస్తీగా వుండడంచేత ఆ ఏడు నూర్పిళ్లు, సంక్రాంతి వెళ్లినాకూడా, పూర్తి కాలేదు. సీతమొగుడు తెల్లారుఝామునే పొలం వెళ్లిపోయాడు కూలీలతోపాటు... వెండిగ్లాసులో కాఫీ నాముందు పెట్టి వెళ్లబోతుంటే "...నువ్వు తాగావా సీతా?" అన్నా. ఒక్కక్షణం ఆగి, వెనక్కి తిరక్కుండానే "అలవాటు తప్పింది" అందిబరువుగా. "ఇవాళ్టికి తాగరాదూ ?....." అన్నా సంకోచిస్తూ. గిరుక్కున వెనక్కి తిరిగి తీక్షణంగా నా మొహంలోకి చూస్తూ "నిజంగా అంటున్నావా, బావా?... ఇంత ఆదరణగా ఇలా నన్ను అడిగినవాళ్లేరీ?" అని యింకోగ్లాసు తెచ్చి, సగం దాట్లో పోసుకుని ఎంతో ఆప్యాయంగా తాగసాగింది. తృప్తిపడ్డ కళ్ళతో, కాఫీగుక్క శంఖంలాంటి ఆఅమ్మాయి కంఠంలోంచి జారి అదృశ్యం అయ్యేదాకా చూస్తూ నెమ్మదిగా నేను కూడా చెంచాలోంచి కొంచెం కాఫీ చప్పరిస్తుంటే "... బావా...కాఫీ బాగుందా?" అని ప్రశ్నించింది మామూలు ధోరణిలో. "ఓ, దివ్యంగా వుంది. నువ్వుకూడా తాగటంవల్ల మరీని" అన్నా. "నేను చేసినపనికి సంతోషించేవాళ్లు యీ ప్రపంచంలో ఒక్కళ్ళన్నా ఉన్నారని నా కిప్పుడే తెలిసింది..." అంటూంటే సంతోషం కనపరుస్తూనే వున్నాయి బుగ్గలు. కాని కళ్లు మాత్రం అశ్రుకణాల్ని విడవటం మానలేదు.......

మధ్యాహ్నం భోజనానికి నేనూ, సీతమొగుడూ కలిసే కూర్చున్నాం. చిన్నప్పుడు కలిసి చదువుకున్న రోజుల్లో గోడుబిళ్ళ లాడడం, ఆబిళ్ల అతని కంటికి తాకటం, అప్పుడు జరిగిన పోట్లాటలూ, పంతులుగారి చదరని చాకుతో కోస్తే,మా యిద్దర్నీ చపుకుతో బాది కోదండంవేయించడం- అన్నీ గుర్తుచేశాడు. ఎంతో చనువుగానూ, సంతోషంగానూ మాట్లాడుతున్నాడు. సీతఅత్తగారు వడ్డిస్తోంది... దోసకాయపచ్చడి ఉప్పు కషాయం!

"ఇంత ఉప్పు పోశావేమిటమ్మా?" అన్నాడు సీతమొగుడు.

"ఇద్దరం వేశామల్లే వుంది...." అని చప్పున నాలిక కరుచుకొని, "మరిచిపోయి రెండుమాట్లు వేశా కామాలు" అని నీళ్లునమిలింది. సీతమొగుడు ఉగ్రుడై "అది చేసిన పచ్చడి నాకు వేశావా?... జ్ఞానం లేదూ? దవడ రాలకొడతా"నంటూ విస్తరి చింపేసి, చెయ్యెత్తి అమాంతం తల్లిమీదికి దూకపోతుంటే, నేను నిశ్చేష్టుడినై "రామం!..." అని మాత్రం అన్నా. అంత వరకూ, పరాయివాణ్ని, నేను ప్రక్కనున్నాననే సంగతే అతనికి తట్టలేదు ఆకోపంలో. నామాట వినేసరికి అతనికి పాపం చచ్చినచావైంది. తలెత్తి నావైపు చూడలేకపోయాడు. రెండంగల్లో దొడ్లోకెళ్లి చెయ్యి కడుక్కొని చకచకా పొలాని కెళ్లిపోయాడు. పక్కగదిలోంచి సీతఏడుపు వినిపిస్తోంది. సీతఅత్తగారు ఏమీ అనలేక తల ఒంచుకునే "చారు పొయ్యమన్నావా, నాయనా" అంటుండగానే ఉత్తరాపోసన పట్టి నేనూ లేచా. నాకుమాత్రం ఎలా నయిస్తుంది అన్నం?... ఎవరూ అన్నం తిన్నట్లు కనిపించలేదు ఆ పూట...

మూడేళ్లయింతర్వాత యిప్పుడేగా నేను ఏడ్జెనుంచి మూడు నెలల శలవు తీసుకువచ్చింది? రైతులూ, వాళ్లూ చాలామందొచ్చారు. వాళ్ళతో మాట్లాడి మూడింటికి లోపలి కొచ్చేసరికి చాపమీద బోర్లగిలా పడుకునుంది సీత. "ఏమీ అత్తగా రెక్కడ సీతా?..." అన్నా... ఉలిక్కిపడి లేచి, పమిట సవిరించుకుంటూ కళ్లు తుడుచుకుంది. కళ్లు వాచివున్నాయి. మొహంఅంతా నలిగి చెరువులోంచి కోసి పారేసిన కమలంమల్లే వుంది. రేగినజుట్టు మనస్సులోని చిక్కులికి సూచికల్లే భయపెడుతోంది.... "పురాణాని కెళ్లారు..." అని నాప్రశ్నకి సమాధానం చెప్పి, లోపలికి తప్పుకోటానికి ప్రయత్నిస్తుంటే నేనే ఆపి "మధ్యాహ్నం భోజనాలముందర ఏమిటా బీభత్సం?" అని అడిగా. చెప్పక తప్పలేదు. చెబుతూ ఏడ్చింది. ఏడుస్తూనే నవ్వింది కాసేపు. కొంత దాచింది. చెప్పక్కర్లేంది కొంత చెప్పింది. తన్నుతాను తిట్టుకుంది. సంఘాన్ని తిట్టింది. ఆ పట్టువిడుపులికి కారణం నాకు యిప్పుడే కొంచెంకొంచెం తెలిసింది. సీత చేత్తో ఒండిన అన్నం తినడట మొగుడు. దానితో మాట్లాడడుట. మొహంచూస్తే అసహ్యించుకుంటాడట. అత్తగారు మాత్రం ఎంతో ప్రేమగా వుంటుంది. అన్నపానాల కేమీ లోటులేదు. నగానాణెమూ బలా వున్నా, బట్టకీ పాచకీ ఏమీ ఇబ్బంది పెట్టరు. అత్తగారు

ఒక్కత్తే పనిచేసుకోలేకపోతే, చాటుగా వచ్చేడీ, అదీ చెయ్యడం, వడియాలు వేయించడం కద్దు సీతకూను. కాని ఆ సంగతి తెలిస్తేమటుకు నానా రాద్ధాంతం చేసి తల్లిని కొడతాడట. సీతనిమాత్రం ఏమీ అనడు.

“నీలోపం ఏమీ లేదా?” అని ప్రశ్నించక తప్పలేదు నాకు అన్నీ విన్నాక. “లేకేం? నే నీపుటక పుట్టడమే లోపం! చదువుకోటం మరీని.” అంటూ మళ్ళా ఎక్కెక్కిడవటం మొదలెట్టింది. నేను అనవసరంగా పాపం ఆ అమ్మాయిని కలవరపెడుతున్నానేమో! “అది కాదు సీతా, మాటవరస కన్నా.... నిజాని కటువంటి మొగుడితో ఎల్లా మెలగటం... నీలోపం ఏముంటుంది?.. ఏదో అన్నా తప్పితే?!”...అని ఓదార్చబోయా. “నిజం చెబుతున్నా బావా! నా తప్పు నేను ఒప్పుకుంటున్నా నీదగ్గిర,...నాగుండెల తాళం తీసేశావు నువ్వు మళ్ళీ ని...నాలుగేళ్ళ క్రితం వినాయక చవితినాడు, మావూళ్లో వినాయకుడి బొమ్మవెనుక నాచేతిలో చెయ్యేసి నువ్వు చెప్పిన మాటలు గుర్తున్నాయా?” అంది. సీతచూపులు నా హృదయంలో గుచ్చుకొని వేదన కలిగిస్తున్నాయి. “అవును సీతా, నాతప్పు క్షంతవ్యంకాదు...కట్నానికి ఆశపడి వేరే సంబంధం చేసుకున్నా-నీకిచ్చిన వాగ్దానాన్ని భంగంచేసి...” అన్నా తలొంచుకొని. “కాని నీకూ ఉన్నసంబంధం ఒచ్చిందికదా, సుఖపడతా వనుకున్నా తప్పితే...” అని యింకా ఏమో అనబోతుంటే, రోషంగా చూస్తూ “ఎంత పూడిపోయింది బావా, నీ హృదయం! స్త్రీహృదయం ప్రేమించిన వస్తువుని మరిచిపోలేదు బావా! పరిసరాలు బలవంతంచేసి మరిపింప చూచినా, ఆ వస్తువు స్థానంలో మరోవస్తువుని వుంచుకోటం అసాధ్యం స్త్రీకి...” అంది. ఊపిరి త్వరత్వరగా విడుస్తూ ముక్కుపుటా లెగరేస్తోంది. నేనేమీ మాట్లాడలేక పోయా. మళ్లా సీతే అందుకొని...“నా కాశ్చర్యంగా వుండేది, అక్కగారితో ఎలా మెలిగేవాడివా నువ్వు అని... బహుశా యిక్కడ నామాదిరే నువ్వూ బాధపడుతున్నా వనుకుని సంతోషిస్తూ వుండేదాన్ని...అది ఏడుపేనేమో !...కాని నిరుడు నీకు మొగపిల్లాడు పుట్టాడని వినగానే...నాకు నీ మీద అంతులేని అసూయ పుట్టింది...అమితమైన అసహ్యం కలిగింది......లేదు, లేదు బావా!....అసహ్యం కలగలేదు బావా!...... నా మీదే నాకు ద్వేషం పుట్టింది ...... నాకు చావు రాదేం?” అని మళ్ళా ఏడవటం మొదలెట్టింది. నేను కొయ్యబొమ్మల్లే నిలబడిపోయా. నాకు తెలీకుండానే నేను ఒకరి జీవితంలో ఎంతటి తుపాను రేకెత్తించా? నాపెళ్ళయిన కొత్తలో కొద్దిరోజులేమన్నా సీతవిషయం గుర్తువచ్చేదేమో. మేము కలిసి మెలిసి ఆడుకున్న ఆటలూ, పాడుకున్న పాటలూ, మాట్లాడుకున్న మాటలూ, చేసుకున్న వాగ్దానాలూ అవీని. కాని నాభార్య కాపరాని కొచ్చినవెంటనే అవన్నీ తేలిగ్గానే మరిచిపోయా. కాని, సీతో? అన్ని స్మృతుల భారాన్నీ పాపం ఆ లేతహృదయం మోసుకు తిరుగుతోందే! నాకు హృదయం వుందా అసలు? నానైచ్యం నాకు అవగతమవుతోంది కొంచెంకొంచెంగా.

“క్షమించు సీతా!...అదే కారణమా?... అన్నా పుండుపడ్డ గుండెతో.

“అవును బావా! నీతో నాకు రహస్యంలేదు. ఉన్నా దాచలేను...ఆర్నెల్లు ఆయ నెంతో సహనం పట్టారు. అనునయించారు. ప్రార్థించారు. క్షమించారు. ...కాని నాకు మొదటినుంచీ ఆయనంటే చిన్నచూపే ...పెద్దచదువు లేదనీ...పల్లెటూరనీ...రూపం లేదనీ... ఇంతకీ చెప్పానుకదూ!...ప్రేమించిన ఒక వస్తువు స్థానంలో ఇంకోవస్తువుని వుంచుకోటం స్త్రీహృదయానికి చేతకాదని...సిగ్గువిడిచి చెబుతున్నా. బావా...తాకనియ్యలేదు నేను...”అంటుంటే సిగ్గుతో ఎర్రబారిన బుగ్గలు దుఃఖంతో గజగజలాడాయి.

కళ్లు చెమ్మగిలాయి. గాద్గదికతో...“ఎంత ఘోరం సీతా!...” అన్నా...సీత గంభీరంగా ఒక్క క్షణం ఊరుకుని “తరవాతతరవాత ఆయనకే అసహ్యం వేసి, నేను ఒండిన అన్నం తిననని శపథంపట్టారు... నాలోని వాంఛలన్నీ పడుకుని దీర్ఘసుషుప్తి పొందే కాలంలో నీ పుత్రోదయవార్త వాటికి మళ్లా గిలిగింత పెట్టింది. అయితే ఏం? నాలోని అహంభావం వాటిని తలెత్తనియ్యకుండా జయప్రదంగా తొక్కిపట్టింది. మా అత్తగారి ప్రేమ నాశరీరాన్నీ, మన మధురస్మృతులు నా మనస్సునీ బతికిస్తూఒచ్చాయి”...ఊ-మాత్రం కొడుతూ నేను ఆత్రంగా వింటున్నా. సీత కథనం సాగించింది

మధ్య మధ్య ఎగపీలుస్తూ, దుఃఖపుగుక్కలు మింగుతూను. "అకస్మాత్తుగా నువ్వురావటం నన్ను కవ్వించింది. ఈ నాలుగేళ్లూ అనంతంలో కలిసిపోయి, ఆ వినాయకచవితి వెళ్లిన పంచమే యివాళ అనిపించింది కాని యీ నాలుగేళ్లూ చెరిపేసి, ఆపంచమినుంచీ జీవితం మొదలెట్టటానికి వీలుంటుందీ ?..." అంటూ మళ్లీ వెచ్చని కన్నీళ్లు కార్చింది.

ఇన్నేళ్లనుంచీ పేరుకునివున్న నేను మొయ్యాల్సిన భారం ఒక్కసారిగా నామీద పడినట్లనిపించింది. ఇన్నేళ్లూ నేను పొందటానికి అర్హతలేని సౌఖ్యం పొందాను. ఇహ నాకు తహతహ పుట్టింది. నేనేం చెయ్యాలి యిప్పుడు? "వీలుంటుంది సీతా, తప్పకుండా. జీవితమే ఒక కష్టకరమైన రాజీ. నేను క్షమించరాని తప్పుచేశానని యిప్పుడు నువ్వు చెప్పేదాకా నాకు బాగా తెలీలేదు. కాని నువ్వు చేసిన తప్పూ తక్కువది కాదు. రెండుజీవితాలు యింతవరకూ బాధపొందాయి. ఇలాగే జరిగితే యింకా రెండుజీవితాలు భ్రష్టంఅవుతాయి..." అన్నా గంభీరంగా. ఉలిక్కిపడి "అదేమిటి బావా?" అంది, అసలే పెద్దకళ్లని యింకా పెద్దవిచేసి ఆదుర్దాగా చూస్తూను.

"అవును సీతా, నాకూ మీ అక్కయ్యకీ ఇహ స్సంబంధం వుండదు." అన్నా అదేధోరణిలో.

"ఏ జన్మలోనో చేసుకున్నది యిప్పు డనుభవిస్తున్నా. ఈ జన్మలో మళ్లా యింకో పాపకర్మమా?" అంది లేనినవ్వు తెచ్చుకొని శుష్కంగా.

"నేనూ శపథం చేస్తున్నా, నీకాపరం కుదటపడందే, నేను సుఖంగా వుండడానికి నాకు హక్కులేదు కనుక నేను చెప్పినట్లు నువ్వు చేసితీరాలి."

అని లేచా. సీత తెల్లబోయి చూస్తూనుంచుంది. నేను వీధిగుమ్మం దిగుతుంటే సీతఅత్తగారు పురాణం నుంచి తిరిగి వస్తోంది. ఆవిడతో టూకీగా రెండుముక్కలు చెప్పి సరాసరి రామందగ్గిరి కెళ్ళా పొలానికి.

అతను పాపం చింతచెట్టుక్రింద దిగాలపడి కూచునివున్నాడు. నేను వీపుమీద చరిచి అన్నీ గుచ్చి గుచ్చి అడిగా. సీత చెప్పిందంతా నిజమే. ఇప్పటికీ ఆ అమ్మాయంటే ప్రేమే ఆతనికి. కాని అతనుమాత్రం ఏం చేస్తాడు? అతన్ని ఒప్పించా

*  *  *  *

ఆ రాత్రి సీతే వంటచేసింది. తనే వడ్డించింది. నేనూ, రామం కలిసే భోజనం చేశాం—రాత్రి గదిలో కెళ్లేటప్పుడు నాకుకూడా నమస్కారం చేసిందిసీత. పాపం, ముసలమ్మ సంతోషానికి మేరలేదు... తెల్లారి సీత సిగ్గుతో నాకు కనిపించకుండా తప్పుకొని తిరుగుతూంటే "...దంతావధానం అయిందా ?" అన్నా నవ్వుతూ. గట్టిగా కళ్లుమూసుకుని పళ్లుచూపిస్తూ లోపలికి వెళ్లిపోయింది.

